విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం
శ్రీ సత్యసాయి
5
సోమవారం 16 - 12 - 2024

# భావితరాలకు ఆదర్శం "అమరజీవి" జీవితం

పుట్టపర్తి, డిసెంబర్ 15(అనంత ప్రభ)


చరిత్రలో అమరజీవి , మహా పురుషుడు అయిన శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశం మేరకు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 72 వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయ సారథి , బీసీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, ఉద్యోగ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

కార్యక్రమంలో భాగంగా తొలుత జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములుచిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు దేశ స్వాతంత్ర పోరాటంలో . ప్రసాద భూమిక పోషించడం జరిగిందని, అలాగే తెలుగుజాతి కోసం ప్రత్యేక రాష్ట్రం సాధనలో కీలక పాత్ర పోషించారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఉద్యమించిన నాయకులలో అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రముఖులని తెలిపారు. 58 రోజులపాటు ప్రత్యేక రాష్ట్రం కోసం దీక్ష చేసి చివరకు తన ప్రాణాలు అర్పించిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు అని అందుకే ఆయనను యావత్తుప్రపంచంఅమరజీవిగా గుర్తించినందున మరియు జాతికి వీరు చేసిన సేవలను గుర్తించి ఈరోజు ప్రభుత్వం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మనందరికీ ఆదర్శం, స్ఫూర్తిదాయకమన్నారు. నేటి తరానికి ఆయన చేసిన త్యాగంను పరిచయం చేయడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సమగ్ర అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

శ్రీ పొట్టి శ్రీరాములు మార్చి 16 1901 సం "లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా అప్పటి మద్రాస్ ప్రాంతంలో జన్మించారని, అలాగే మద్రాస్ రైల్వే శాఖలో ఇంజనీరింగ్ భాగం లో ఉద్యోగరీత్యా సేవలు అందించారని జాతిపిత మహాత్మా గాంధీ ప్రభావం,



జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఆలోచనలు వారిలో స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తినిచ్చిందని తద్వారా శ్రీ పొట్టి శ్రీరాములు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పి స్వాతంత్ర సమర ఉద్యమాల్లో పాల్గొని కొంతకాలం జైలు శిక్ష కూడా అనుభవించి విడుదల

య్యారన్నారు. అంతేగాక హరిజనుల కోసం అనేక సాంఘిక కార్యక్రమాలు నిర్వహించి వారి జీవిత ప్రమాణాలు మెరుగు పరచడానికి శ్రీ పొట్టి శ్రీరాములు కృషి చేశారన్నారు. తెలుగు జాతి కోసం ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక రాష్ట్ర సాధనే 1952లో నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. ఆయన జీవిత చరిత్రలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన 5 8 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చివరకు ప్రాణాలు అర్పించిన అంశం నేటికి ముఖ్య ఘట్టంగా నిలిచిందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరియు పోరాట ఫలితంగా 1953లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. త్యాగం, సంఘీభావం, సమానత్వం వంటి మానవత విలువలు కలిగిన ఆయన జీవితం ఎంతో ఆదర్శనీయమై నదన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు ఆయన చేసిన సేవలను ఎప్పటికీ మరవరాదన్నారు.

ఈ కార్యక్రమంలో పెనుగొండ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్. గంగాధర్, హిందూపురం సుబ్బరాయుడు, ధర్మవరం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 30 రోజులు ఉచిత గురుకుల శిక్షణ



అనంతపురం, డిసెంబర్ 15 (అనంత ప్రభ)

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: మూడేళ్లుగా ప్రభుత్వ బడుల విద్యార్థుల ప్రయోజనం కోసం పోటీ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అభయ, నిస్వార్థ ఫౌండేషన్లు సంయుక్తంగా శనివారం కలెక్టర్ కార్యాలయ మినీ కాన్ఫరెన్సు హాలులో సూపర్-60 పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్, ఆర్జీటీ సెట్.. వంటి కీలక ప్రవేశ పరీక్షలకు 30 రోజులపాటు ఉచితంగా శిక్షణ, భోజన, వసతి కల్పించడం సంతోషకరమన్నారు. కేవలం ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పించడం చాలా మంచిదన్నారు. నిర్దేశిత సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉచితంగా బోధించడం ప్రశంసనీయమన్నారు. ఆ తర్వాత అభయ ఫౌండేషన్ సుంకు బాల చంద్ర, నిస్వార్థ ఫౌండేషన్, సూపర్-60 డైరెక్టర్ తాటికొండ వెంకట్ మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సూపర్-60 కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 14 నుంచి జనవరి 15లోపు ఆన్‌లైన్ లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జనవరి 26న తొలి దశ ఆన్‌లైన్ పరీక్ష రాయాలి. ఇందులో ఎంపికైన వారికి బీకే సముద్రం మండలం రోటరీపురం సమీపంలోని అభయ ఫౌండేషన్ సంస్థలో జిల్లా స్థాయి పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఎంపికైన వారికే ఉచిత గురుకులాల శిక్షణ ఇస్తామని వారు చెప్పారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బండి శ్రీనివాసులు, ప్రతాప్, రాజేశ్, జయరాం నాయక్, తిరుపాల్‌నాయక్, యుగంధర్, శర్మాస్, శివరుద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## యాడికిలో ప్రజా మానవ హక్కుల కమిటీ సర్వసభ్య సమావేశం





యాడికి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)

ప్రజా మానవ హక్కుల కమిటీ సర్వసభ్య సమావేశాన్ని యాడికి మండల కేంద్రంలోని విజన్ హై స్కూల్ నందు ప్రజా మానవ హక్కుల కమిటీ జిల్లా ప్రెసిడెంట్ విశ్వనాథ్, సెక్రటరీ గుండా నారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ మానవ హక్కుల అధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఆర్.టి.ఐ చలమారెడ్డి పాల్గొన్నారు, ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ ప్రజా మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ఏ విధంగా పోరాటం చేయాలో వివరిస్తూ, పేద ప్రజలకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని, ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మానవ హక్కులపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రజా మానవ హక్కుల జాయింట్ సెక్రటరీగా కుండా లక్ష్మీనారాయణ, ట్రెజరర్ గా కుమ్మెత రామిరెడ్డి, తాడపత్రి తాలూకా ప్రెసిడెంట్ పి ఆర్ మహారాజ్, వైస్ ప్రెసిడెంట్ ఎం చంద్రమౌళి, జాయింట్ సెక్రెటరీ ఎం శివప్రసాద్ గారికి సర్టిఫికెట్స్, ఐడి కార్డులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, యాడికి టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, బిజెపి యాడికి మండల కన్వీనర్ చింతా చౌడయ్య, చింతా ఓబుల కొండయ్య, దాసరి కృష్ణ, చారుగుండ్ల చెన్నప్ప, చింతా వెంకటయ్య, గుండా దేవేంద్ర, గుండా ఓబులేసు, శేఖర్, ఆకుల సురేష్, తిరు తదితరులు పాల్గొన్నారు

## హక్కుల కోసం పోరాటంలో రాజీలేదు,వి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి

కూడేరు, డిసెంబర్ 15(అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కేంద్రంలోని ఎన్జీవో హోమ్ లో జిల్లా అధ్యక్షులు జానకి రాముడు అధ్యక్షతన జరిగిన 65వ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో ముఖ్య అతిథిగ విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నవంబర్ 26 2007లో కృష్ణ మాదిగ గారి ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగ ఆరు నెలల పాటు వికలాంగుల కోసం ఎన్నో సభలు సమావేశాలు ఏర్పాటు చేసి వికలాంగులలో ఆత్మస్థైర్యం చైతన్యం నింపుతు ఆనాటి నుండి నేటి వరకు ప్రభుత్వాలతో ఎన్నో పోరాటాలు చేయడం వలనే 75 రూపాయల 225, 1500 పెన్షన్ నుండి నేడు 5000 10000, 15000 రూపాయలు పెన్షన్ తీసుకుంటున్నామని ఈఘనత కృష్ణమాదిగ పోరాట ఫలితమేనని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని విహెచ్పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న పిలుపునిచ్చారు.

పెన్షన్ తో పాటు బడ్జెట్ పెంపు వికలాంగులకు హోములు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు మోటార్స్ వెహికల్స్ 2016 వికలాంగుల చట్టం పునర్నిర్మాణం మ్యారేజ్ ఇన్సెంటివ్ అంథోదయ కార్డులు ఇళ్ల స్థలాలు సబ్సిడీ లోన్లు పండ్స్ చదువుకుంటున్న వికలాంగుల కొరకు ప్రత్యేక వసతి ఇలాంటివి ఎన్నో తదితర వాటిని ఉద్యమాల ద్వారానే సాధించుకున్నామని భవిష్యత్తులో కూడ ఇటువంటి వాటి పెంపు కోసం మరొకసారి పోరాటం చేయుటకు వికలాంగులు సిద్ధంగ ఉండాలని




హక్కుల కోసం పోరాటంలో రాజీపడేది లేదని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్నతో పాటు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులకుంట రామాంజనేయులు విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు జానకిరాముడు జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మసముద్రం తిప్పేస్వామి కళమండలి అధ్యక్షులు పుల్లన్న విహెచ్పిఎస్ విద్యార్థి నాయకుడు విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రంగనాథ్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ మొండిపోగల ఎర్రిస్వామి నిస్సర్ అహ్మద్,వెంకటేశు భాగ్యమ్మ ,జిల్లా మహిళ అధ్యక్షురాలు జయమ్మ, ఎంఆర్పిఎస్ మహిళ అధ్యక్షురాలు స్వతంత్రకుమారి, విహెచ్పీఎస్ మహిళ నాయకురాలు పద్మ, హుస్సేన్ బి,వరాలమ్మ వీహెచ్పీఎస్ నగర అధ్యక్షులు నాగరాజు కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ ముందుగా సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు - ఎస్ వి ఈ ఎస్ డైరెక్టర్ సతీష్ కుమార్

అనంతపురం, డిసెంబర్ 15(అనంత ప్రభ)

అనంతపురం రూరల్ రాప్తాడు నియోజకవర్గం బళ్లారి బైపాస్ నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కన ఆదర్శ నర్సింగ్ కాలేజ్ నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సతీష్ కుమార్ ముందుగా అందరికీ సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ పండుగను సందర్భంగా అందరికీ ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. గత 25 సంవత్సరాలుగా శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదర్శ నర్సింగ్ కాలేజ్, విమల నర్సింగ్ కాలేజీలతో ఎంతోమంది విద్యార్థినిలకు బీఎస్సీ నర్సింగ్, జిఎన్ఎమ్ బిపిటి తదితర కోర్సుల్లో ఆదర్శ్ , విమల్ నర్సింగ్ కళాశాల నందు వైద్య విద్య బోధనలో అత్యంత



నైపుణ్యం గల మహిళ లెక్చరర్స్, ప్రిన్సిపల్ ల ఉపాధ్యాయునీయుల ద్వారా విద్యార్థినీలకు ఆధునిక సాంకేతిక విద్యా బోధనతో కూడిన వైద్య విద్యను అందిస్తూ విద్యార్థినీలు ఎవరి మీద ఆధారపడకుండా స్వయంగా ఎవరు కాళ్ళ మీద నిలబడగలిగే స్థాయిలో స్థిరపడే విధంగా వైద్య విద్యా బోధనను అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

## ఎమ్మెల్యే కి అభినందనలు తెలిపిన ఏకగ్రీవనాయకులు..

పామిడి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)

పామిడి మండలంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలలో కాలవ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ సీనియర్ నాయకుడు ఓబులాపురం వెంకటేష్ గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం మరియు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆలూరు పట్టణం లోని స్థానిక నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మీనుగ వెంకటేష్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించినందుకు మీకు జీవితాంతం రుణపడి ఉంటానని ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న నన్ను నాపై నమ్మకం ఉంచి నన్ను కాల్వ చైర్మన్ గా చేయడం



సంతోషకరమని, పార్టీ అభివృద్ధి కొరకు క్షేత్రస్థాయిలో పనిచేస్తామని ఈ సందర్భంగా మీనుగా వెంకటేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాజేష్ నాయక్, వడ్డే ఆనంద్ బాబు, కాయల మహేష్, రామాంజనేయులు నాయక్, పల్లె శ్రీనివాసులు, భాస్కర్ యాదవ్,బోయ శేఖర్,ఆవుల శివ తదితరులు పాల్గొన్నారు..

## బస్సు-ఆటో ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులు తో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల, డిసెంబర్ 15(అనంత ప్రభ)

బస్సు-ఆటో ప్రమాదంలో మరణించిన పుట్లూరు మండలం,ఎల్లుట్ల గ్రామానికి చెందిన వారి బాధిత కుటుంబ సభ్యులు తో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని,ప్రభుత్వం నుంచి అందించే సహాయంలో ఎక్కడ రాజకీయ కోణం చూడమని పేర్కొన్నారు. బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్న వారి మాటలను నమ్మవద్దని కోరారు. రాజకీయాలు చేయకుండా,పేదల కోసం తపన ఉంటే ప్రభుత్వానికి వినతి చేయచ్చని చెప్పారు.




పరామర్శ సమయంలో బాధిత కుటుంబాలలో అర్హులైన వాళ్లకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఆర్థిక మంత్రి వర్యులు శ్రీ పయ్యావుల కేశవ్ హామీ మేరకు అర్హతలు ఉన్న వాళ్ళు బయోడేటా,విద్యార్హత జిరాక్స్ కాపీలు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పరిశీలించారు.

AP 4PG 16 12 2024 monday qxp_Layout 1 15-12-2024 10:07 PM Page 2



## శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు




యాడికి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని వెంగమనాయుడు కాలనీలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ పాల్గొన్నారు. వీరు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, గత మూడు రోజుల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆదివారం విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభం కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు, ప్రజలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో టిడిపి, వైసిపి నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## వృద్దులకు బెడ్ షీట్లు, స్వెట్టర్లు పంపిణీ



యాడికి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని చవ్వా అశ్వర్థమ్మ వృద్దాశ్రమంలోని వృద్దులకు స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ యాజమాన్యం ఆదివారం బెడ్ షీట్లు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. చలికాలంలో వృద్దులు ఇబ్బందులు పడకూడదని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆశ్రమంలో వృద్దులకు నిత్యావసరాలను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రెసిడెంట్ పామిశెట్టి బాలయ్య స్టార్ పారడైజ్ హై స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ యాజమాన్యం నాగేంద్ర, రంగ, ఇలాహి, ఉపాధ్యాయులు శశినేత్ర, మహేష్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమలకు సైకిల్ పై ప్రయాణం



యాడికి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
కేరళ రాష్ట్రంలోని అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమలైకు యాడికి మండల కేంద్రం నుండి సైకిల్ పై ప్రయాణాన్ని ప్రారంభించారు. యాడికి మండలానికి చెందిన రంగా, అనిల్, కార్తీక్, కిరణ్ నలుగురు అయ్యప్ప స్వామి భక్తులు అయ్యప్ప మాల ధరించి యాడికి నుండి శబరిమలై కు సైకిల్ పై ప్రయాణాన్ని ప్రారంభించారు, మొదట మండల కేంద్రంలోని అన్ని దేవాలయాలకు వెళ్లి స్వామివార్ల ఆశీర్వాదం తీసుకుని దాదాపుగా 1000 కిలోమీటర్లు ప్రయాణాన్ని 15 రోజుల్లో చేరుకోవాలని ఆదివారం బయలుదేరి వెళ్లారు, ఈ సందర్భంగా మండల కేంద్ర ప్రజలు వారికి అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రయాణాల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా స్వామివారిని దర్శించుకోవాలని దేవుని వేడుకొన్నారు

## శ్రీ వాసవి అమ్మవారికి మార్గశిర మాస పౌర్ణమి ప్రత్యేక పూజలు



యాడికి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా ఆర్య వైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అమ్మవారికి వేకువజాముననే ఆలయ పండితులు భక్తుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి నిర్వహించే శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని కూడా వాసవి సేవా సంఘం మహిళలు దిగ్విజయంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

## హక్కుల ఉల్లంఘనపై ప్రశ్నిద్దాం

అనంతపురం, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
ప్రతి చోటా సాగుతున్న హక్కుల ఉల్లంఘన లేకుండా ఆధిపత్యాన్ని ప్రశ్నిద్దామని వక్తలు సూచించారు. హెచ్ఆర్ఎఫ్ (మానవ హక్కుల వేదిక) 10వ రాష్ట్ర మహాసభలు శనివారం స్థానిక ఆపిల్ ఫంక్షన్ హాలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంతర్గత సమావేశాలు, వివిధ జిల్లాల కమిటీల ఎంపిక జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 144 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల ఆహ్వాన కమిటి అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, తెలంగాణ హెచ్ఆర్సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, డాక్టర్ తిరుపతి, ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రాజేష్, కర్ణాటక ప్రతినిధి శ్రీధర్ తొలి సందేశం ఇచ్చారు. పీపుల్స్ డెమెక్రటిక్ ఫ్రంట్, ఏపీ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు చేయాలని, ప్రార్థనా స్థలాల చట్టం 1991ను అమలు చేసి మైనార్టీల ప్రార్థనా స్థలాల మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల కేసుల్లో దర్యాప్తు విచారణ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులుగా అనంతకు చెందిన చంద్రశేఖర్‌తో పాటూ జీవన్‌కుమార్, వసంతలక్ష్మి, కృష్ణ తదితరులున్నారు.

## యాడికిలో ఘనంగా పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి



యాడికి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఆదివారం యాడికి మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగవరం పవన్ మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్రం కోసం భగత్ సింగ్ లాంటివారు మన ఆంధ్ర రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు గారు చేసినటువంటి ఆత్మార్పణం ప్రతి ఒక్క ఆంధ్రుడు గుర్తుంచుకోవాలన్నారు, భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత వివిధ భాషలు మాట్లాడే వారికి వారి పరిపాలన సౌలభ్యం కొరకు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాలని ఆలోచన వచ్చిందని ఆ విధంగా వివిధ రాష్ట్రాలు ఏర్పడ్డాయని కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడలేదని దీనిని పరిశీలించిన శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్దేశంతో ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణ త్యాగాన్ని చేశారని ఇలాంటి త్యాగాల ఫలితమే మన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడానికి కారణమైందని అన్నారు, మన అందరమూ కలసి ఏదైనా సాధించాలనే దృఢ సంకల్పం ఉంటే దేనినైనా సాధించవచ్చని, అందుకు పొట్టి శ్రీరాములు గారే నిదర్శనమని అన్నారు, ఆంధ్ర రాష్ట్రం కోసం దాదాపు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తాను ఆత్మార్పణ చేసుకొని మనకు ఆంధ్ర రాష్ట్రాన్ని తీసుకొచ్చారన్నారు. అనంతరం ఆర్యవైశ్యులందరూ పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మద్దాల విశ్వనాథ్, రవితేజ, తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు

## సమాచార హక్కు పరిరక్షణ జిల్లా ఉపాధ్యక్షులుగా కోటేగంటి నబి రసూల్ ఏకగ్రీవం





తాడిపత్రి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
అనంతపురం పట్టణంలో ని విద్యుత్ నగర్ లో సమాచారం హక్కు పరిరక్షణ సంఘం కార్యాలయం లో అనంతపురం జిల్లా అధ్యక్షుడు హొన్నూరుప్ప గౌరవ అధ్యక్షులు నబి రసూల్ ఆధ్వర్యంలో సమాచార హక్కు పర్య రిరక్షణ సంఘం నూతన కమిటీ సమావేశం సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా కోటేగంటి నబి రసూల్ ని ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హొన్నూరుప్ప గౌరవ అధ్యక్షులు నబి రసూల్ సెక్రెటరీ ట్రెజరర్ జాయింట్ సెక్రెటరీ కార్యదర్శులు షౌకత్ అలీ మనోజ్ కుమార్ రంగస్వామి దాదా పీర్ లక్ష్మీదేవి కార్యవర్గ సభ్యులు హుస్సేన్ పీరా హాజీవలి శివకుమార్ చంద్రశేఖర్ ప్రసాద్ పాల్గొన్నారు

## శ్రీశైలం పాదయాత్రకి తరలిరండి : పెరుమాళ్ళ జీవానంద రెడ్డి..




పామిడి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
మహా పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి చెంతకు అనంతపురం జిల్లా నుండి శ్రీశైలం వరకు 300 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి అనంతపురం జిల్లా నుండి శ్రీశైలం వరకు పాదయాత్ర కొనసాగిస్తున్న జీవానంద రెడ్డి 2025 ఫిబ్రవరి న శ్రీశైలానికి పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి తెలిపారు. సాంస్కృతి కళాకారులతో డప్పు వాయిద్యాలతో నృత్య కళాకారులతో ఈ పాదయాత్ర కొనసాగిస్తున్నామని, పాదయాత్రలో వచ్చేటువంటి భక్తార్థులకు అన్ని వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం శివలింగం ఏర్పాటు చేసి భక్తాది భక్తుల నడుమ భజన చేసుకుంటూ శివనామ స్మరణంతో ముందుకు కొనసాగిస్తున్నామన్నారు. 2025 నా అంగరంగ వైభవంగా భక్తాది భక్తుల నడుమ ఈ పాదయాత్ర ముందుకు కొనసాగుతుందన్నారు. పాదయాత్రలో పాల్గొన్నదలచిన వారు 9888539999 నెంబర్ ని సంప్రదించవలన్నారు. పాదయాత్రలో పాల్గొన్న భక్తాది భక్తులకు భోజనం వసతి తో పాటు తిరిగి రావడానికి బస్సులు ఏర్పాటు చేశమన్నారు..

## ప్రతి ఒక్కరూ భారతీయ సనాతన సంస్కృతి సాంప్రదాయాలు పాటించాలి : పీఠాధిపతి.



పామిడి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
భారతీయ సనాతన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలవారికి భోదించ వలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దత్త మహాయోగ పిఠాధిపతి శ్రీ సురేంద్ర మహారాజ్ పిలుపునిచ్చారు. గురు దత్తత్రేయ జయంతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పామిడి పట్టణం లోని భావసారా క్షత్రియ భవన్ ఏర్పాటైన సభలో పై విధంగా విజ్ఞప్తి చేశారు. సంపాదన ఎంత ముఖ్యమో సంస్కృతి, సాంప్రదాయ భోధన అంత ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. లేనినాడు అన్య మతస్థుల బారిన పడి మనభిమానాలు కోల్పోవలసి వస్తుందని అయన అన్నారు. మోన దీక్ష, యోగ బ్యాసాలు మానవునికి అవసరం అన్నారు. మానవుని నిబిడికృత శక్తి మానవుని అవసరాలు అనే అంశం పై డాక్టర్.రాయుడు హిందూధర్మ ఆచరణ -హక్కుల రక్షణ పై ఆవుల ప్రసాద్, భగవద్గీత -ప్రస్తావన పై సంజన్న, హైందవ శంఖరవం -విజయ మార్గం పై శ్రీనివాసులు ప్రశాంగించారు. తులసి మాతాజీ బృందం చే అన్నమయ్య కీర్తనలు, శ్రీనివసరావు చే ఘంటసాల భగవద్గీత ఆలాపన జరిగింది. ఉదయం పీఠమ్ లో దత్తాత్రేయ జననం కు సూచికగా ఊయల సేవ నామకరణం చేశారు. అనంతరం మేళ తాళలతో, భజనలతో దత్త పాదుకలు పల్లకి లో ఉంచి గ్రామోత్సవం చేశారు. ఉదయం దత్త అభిషేక పూజలు చేశారు. సభలో సురేంద్ర మహారాజ్ ను శిష్యులు సత్కరించారు..

## రూ 2.5 కోట్లు గవి మఠా భివృద్ధికి కేటాయించండి. -ఆర్థిక మంత్రిని అభ్యర్థించిన జగద్గురు.



ఉరవకొండ, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
జగద్గురు చెన్న బసవ రాజేంద్ర స్వామి జై మఠాభివృద్ధికి రెండున్నర కోట్ల నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ లు ఆయన స్వగృహంలో కలిసి మాఠాభివృద్ధికి సహకరించాలని కోరారు.
కామన్ గుడ్ ఫన్ కింద రూ రెండున్నర కోట్ల ను ప్రభుత్వ నిధుల నుంచి గాని లేదా తిరుమల తిరుపతి దేవస్థాన నిధుల నుంచి గాని మంజూరు చేయించి ఆర్థిక చేయూతనందించాలని మంత్రి పర్యావల కేశవకు సమర్పించిన వినతి పత్రంలో కోరారు.
మంత్రికి పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. అభివృద్ధి నిధుల కేటాయింపుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించినట్లుగవి మఠ ఏజెంట్ రాజన్న గౌడ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు ఏళ్ళ తిమ్మప్ప, రాయల భీమన్న, విటల్ రుక్మిణి ఆశ్రమ నిర్వాహకులు ఎర్రి స్వామి తదితరులు ఉన్నారు.






## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్యనిర్వాహణాధికారి బి.బాబు



ఆత్మకూరు, డిసెంబర్ 15(అనంత ప్రభ)
ఆత్మకూరు మండలం స్థానిక మండలం పరిధిలోని పంపునూరు గ్రామంలో ఆదివారం రోజున ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా స్వామి వారికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం , అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి మరియు కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హెూమము" నిర్వహించడమైనది. భక్తులు స్వామివారి అభిషేకం, హెూమము యందు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు.

## అమర జీవి పొట్టి శ్రీరాములు కు నివాళులర్పించిన మండల ఎంపీపీ హేమలత



ఆత్మకూరు, డిసెంబర్ 15(అనంత ప్రభ)
ఆత్మకూరు మండలం స్థానిక మండల కేంద్రంలోని ఆదివారం రోజున అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మండల ఎంపీపీ హేమలత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని కావాలని 58 రోజులు అమర నిరాహార దీక్ష చేసి తెలుగువారి కోసం, ప్రత్యేక తెలుగు రాష్ట్రం కావాలని తన ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆమె నివాళులు అర్పించారు.

## శ్రీ పొట్టి శ్రీరాములు కు నివాళులర్పించిన తాసిల్దార్



ఆత్మకూరు, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
ఆత్మకూరు మండలం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందు పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు తాసిల్దార్ శ్రీ లక్ష్మీ నాయక్, ఆత్మకూరు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగభూషణం, మరియు వీఆర్ఏలు, ఆత్మకూరు మండల సమావేశకర్త గంతి శ్రీనివాసులు , పొట్టి శ్రీరాముల కు నివాళులు అర్పించడం జరిగింది.

## వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్రిమల చెన్నకేశవరెడ్డి..



పామిడి, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
పామిడి మండలం ఎద్దులపల్లి గ్రామంలో బోయ తిమ్మప్ప కూతురు వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎద్దులపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాబు వంక రాజు కాల్వ సర్పంచ్ నరసింహ అనంపల్లి సర్పంచ్ నారాయణస్వామి సొరకాయల పేట నాగేష్ యాదవ్ అనుంపల్లి సత్తి తదితరులు పాల్గొన్నారు..

## లోక్ అదాలత్‌లో ఇరువురూ విజేతలే



అనంతపురం, డిసెంబర్ 15 (అనంత ప్రభ)
సాధారణంగా ఏ కేసులోనైనా ఒక వైపు మాత్రమే విజయం వరిస్తుందని, అదే లోక్ అదాలత్‌లో ఇరు వైపులా (ఉభయులూ) విజేతలేనని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (జిల్లా జడ్జి) జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. ఎస్పీ పి.జగదీష్, జిల్లా న్యాయశాఖాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,235 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 25 బెంచ్‌ల ద్వారా కేసులు విచారించారు. ఈ సందర్భంగా 5,753 క్రిమినల్ కేసులు, 151 సివిల్ కేసులు, 66 మోటారు వాహన ప్రమాదభరిత కేసులు, 271 ప్రీలిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాదభరిత కేసుల కక్షిదారులకు రూ.5.67 కోట్ల పరిహారం చెల్లింపునకు రాజీ కుదిర్చారు. సివిల్ కేసుల్లో రూ.31,96,134, ప్రీలిటిగేషన్ కేసుల్లో రూ.1.21 కోట్ల పరిహారాన్ని కక్షిదారులకు న్యాయవాదులు ఇప్పించారు.

# వన్ అండ్ ఓన్లీ రష్మిక .. ఒకే నెలలో రెండు 900 కోట్ల సినిమాలతో ఏ హీరోయిన్‌కి లేని రికార్డ్



ప్రస్తుతం భారతీయ చిత్ర పరిశ్రమలో ఉన్న టాప్ మోస్ట్ హీరోస్ లిస్ట్ లో మన సౌత్ హీరోల పేర్లే ఎక్కువ కనిపిస్తాయి. వీరితో పాటుగా ఇండియన్ సినిమా టాప్ అండ్ బిజీ హీరోయిన్స్ లిస్ట్ తీసినా హిందీ హీరోయిన్స్ పేర్లు ఎక్కువ రావచ్చు కానీ ఒక్క హీరోయిన్ డామినేషన్ మాత్రం మామూలు లెవెల్లో లేదని చెప్పాలి. కాగా ఆ హీరోయిన్ నే నేషనల్ క్రష్ రష్మికా మందన్నా..

రష్మిక పరిచయం అవ్వడానికి సౌత్ నుంచే అయ్యినప్పటికీ ఇపుడు పాన్ ఇండియా సినిమాని రూల్ చేస్తుంది. కాగా రష్మిక హీరోయిన్ గా ఇపుడు చేస్తున్న లేటెస్ట్ చిత్రాలు చాలానే ఉన్నాయి కానీ తాను నటించిన లేటెస్ట్ భారీ చిత్రం ఒకటి మాత్రం ఇండియన్ సినిమాని షేక్ చేస్తుంది. ఆ సినిమానే పుష్ప 2 ది రూల్.

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా దర్శకుడు సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన ఈ చిత్రంలో రష్మిక తన పెర్ఫామెన్స్ తో పాటుగా బోల్డ్ హాట్ షోతో కూడా ఓ రేంజ్ లో అలరించింది. కాగా ఈ సినిమాతోనే రష్మికా తన కెరీర్‌లో మొట్టమొదటి 1000 కోట్ల క్లబ్‌లో చేరిన సినిమాలో నటించిన హీరోయిన్‌గా నిలిచారు. అయితే ఆమె ఇపుడు టోటల్ ఇండియన్ సినిమా దగ్గర ఒక ఇంట్రెస్టింగ్ అండ్ సెన్సేషనల్ రికార్డు తాను తన ఖాతాలో వేసుకున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది.

ఒక్క ఏడాది వ్యవధిలో అది కూడా ఒకే నెలలో యాదృచ్ఛికంగా ఆమె నటించిన సెన్సేషనల్ పెర్ఫామెన్స్ చిత్రాలు 900 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకొని సంచలనం సెట్ చేసాయి. దీనితో ఇండియన్ సినిమా దగ్గర రష్మిక మందన్నాకి ఈ బోగ్ రికార్డు సొంతం అయ్యింది అని చెప్పాలి. మరి ఒక 900 కోట్ల సినిమా లేటెస్ట్ పుష్ప 2 అని అందరికీ తెలుసు. కానీ మరో సినిమా ఏదంటే .. సరిగ్గా ఇదే డిసెంబర్ 2023లో విడుదల అయ్యిన చిత్రం యానిమల్.

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ నటించిన ఈ చిత్రాన్ని తెలుగు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించారు. ఇలా ఒకే నెలలో రెండు సార్లు 900 కోట్ల బాక్సాఫీస్ కలెక్షన్స్ కొట్టిన వన్ అండ్ ఓన్లీ హీరోయిన్ గా ఇపుడు ఇండియన్ సినిమా దగ్గర నేషనల్ క్రష్ నిలిచింది. అంతేకాదు.. ఈ రెండు సినిమాల్లో కూడా హీరోలు రష్మిక కాళ్ళ దగ్గరే వచ్చారు అని మరో క్రేజీ కో ఇన్సిడెంట్ కూడా కలిసిన సంగతి అందరికీ తెలిసిందే. దాని తర్వాత బాక్సాఫీస్ దగ్గర కూడా ఇలా కలవడం గమనార్హం.

ఇక రష్మిక నుంచి ఇది మాత్రమే కాకుండా రానున్న రోజుల్లో పాన్ ఇండియా లెవెల్లో మరిన్ని చిత్రాలు ఉన్నాయి. వీటిలో ధనుష్ తో కుబేర.. అలాగే హిందీలో సల్మాన్ ఖాన్ మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సికందర్. అలాగే మరిన్ని ఇతర సినిమాలు చేస్తూ రష్మిక బాలీవుడ్ హీరోయిన్స్ కి సైతం గట్టి పోటీని ఇస్తూ టాప్ రేంజ్ లో దూసుకెళ్తుంది. ప్రస్తుతానికి పుష్ప 2 సక్సెస్‌ని రష్మిక ఎంజాయ్ చేస్తున్నారు.




# బ్లూ కలర్ డ్రెస్‌లో రకుల్ స్టన్నింగ్ లుక్..



సాధారణంగా ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబంలో అంతా ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటారో తెలిసిందే. అలాంటి ఫ్యామిలీ నుంచి వచ్చి టాప్ హీరోయిన్‌గా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్. ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకున్నారు రకుల్. ప్రస్తుతం తెలుగు తెరకు దూరంగా హిందీలోనే తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

10 అక్టోబర్ 1990న పంజాబీ సిక్కు కుటుంబంలో న్యూఢిల్లీలో జన్మించారు రకుల్ ప్రీత్ సింగ్. ఆమె తండ్రి కుల్వీందర్ సింగ్ ఆయన ఆర్మీలో ఆఫీసర్.. తల్లి రాజేందర్ కౌర్. ధౌలా కౌన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం, ఢిల్లీలోని జీసస్ అండ్ మేరి కాలేజీలో మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు రకుల్. క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వాన్ని తన పేరెంట్స్ నుంచే నేర్చుకున్నానని రకుల్ ఎన్నో వేదికలపై తెలిపారు ఈ ముద్దుగుమ్మ. వారే తనకు ఇన్స్పిరేషన్ అని.. జీవితంలో అనుకున్నది సాధించడానికి తనను వెన్నుతట్టి ప్రోత్సహించారని తన తల్లిదండ్రుల గురించి గొప్పగా చెబుతుంటారు.

అందరూ నటనపై ఆసక్తితోనో, ప్యాషన్‌తోనో సినీ పరిశ్రమలో అడుగుపెడుతుంటారు. అయితే రకుల్ మాత్రం కేవలం పాకెట్ మనీ కోసం ఇండస్ట్రీలో అడుగుపెట్టారట. తొలుత కన్నడంలో గిల్లి సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రకుల్.. తర్వాత మోడలింగ్‌లో దుమ్మురేపా-రు. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో తెలుగువారిని పలకరించారు . ఈ సినిమాలో ఆమెకు నేమ్ అండ్ ఫేమ్ వచ్చింది . వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకుంటూ టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు. చిన్నా, పెద్దా అందరికీ రకుల్ ప్రీత్ సింగే హీరోయిన్‌గా కావాలి అన్నంతగా బలమైన ముద్రవేశారు.

టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలోనూ ఛాన్స్‌లు పట్టేసింది రకుల్. తన సంపాదనను తెలివిగా పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి రెండు చేతులా సంపాదిస్తున్నారు. బాలీవుడ్ నటుడు, నిర్మాత అయిన జాకీ భగ్నానితో కొన్నాళ్లు డేటింగ్ చేసిన రకుల్ ప్రీత్ సింగ్ ఆయనను పెళ్లాడారు. ప్రస్తుతం హిందీలో దే దే ప్యార్ దే 2లో నటిస్తున్నారు. అన్షుల్ శర్మ దీనికి దర్శకుడు కాగా వచ్చే ఏడాది మార్చిలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు.

# ధనుష్‌తో కాంట్రవర్సీపై నయనతార ఓపెన్ క్లారిటీ .. ఇంత జరిగినా తగ్గట్లేదుగా



రీసెంట్‌గా సౌత్ ఇండస్ట్రీలో ఓ రేంజ్‌లో హైలైట్ అయిన పలు అంశాల్లో భారీ సినిమాల విడుదలలు మాత్రమే కాకుండా వాటితో పాటుగా పలు క్రేజీ కాంట్రవర్సీలు కూడా స్పెషల్ అటెన్షన్ ని తెచ్చుకున్నాయి . వీటిలో కొన్ని రోజులు అయినా మాంచి ఎంటర్టైన్మెంట్‌ని ఇచ్చిన కాంట్రవర్సీ మాత్రం తమిళ స్టార్ హీరో అండ్ హీరోయిన్లు ధనుష్ , నయనతారల కాంట్రవర్సీ అని చెప్పాలి.

భారీ మొత్తంలో డబ్బులకి తన పెళ్లి డాక్యుమెంటరీ హక్కులను పాపులర్ ఓటిటి సంస్థ నెట్ ఫ్లిక్స్‌కి అమ్ముకున్న సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాణం వహించిన నానుమ్ రౌడీ దాన్ సినిమా తాలూకా విజువల్స్ ఒక మూడు సెకండ్స్ పాటు కనిపించడంతో ధనుష్ లీగల్ గా తన సినిమా కాపీ రైట్ ఇష్యూ రైజ్ చేసి నయన్ కి షాకిచ్చాడు.

అయితే ధనుష్ సైలెంట్ గానే నోటీసులు పంపితే దానిని నయనతార ఓపెన్ గా పెద్ద ప్రెస్ నోట్ రిలీజ్ చేసి బహిర్గతం చేసింది. ఇక అక్కడ నుంచి ఇద్దరి నడుమ మంచి మసాలా స్టార్ట్ అయ్యింది. మొదట నయన్‌కి చాలా మంది సపోర్ట్ చేసినప్పటికీ నెమ్మదిగా ధనుష్‌కి పాజిటివిటీ పెరగడం మొదలైంది. ఇలా ఇద్దరి నడుమ రగడ పెరుగుతూ వెళుతుంది.

మరి ధనుష్ తనకి 10 కోట్లు కట్టాలని నయన్‌ని ఇరికిస్తే నయన్ ఏమో ఇన్ డైరెక్ట్ గా పలు వార్నింగ్స్ కూడా ఇచ్చేది. ఇలా ఈ హైడ్రామా ఇపుడు ఒక రియాలిటీకి వస్తుంది. లేటెస్ట్‌గా నయనతార ఈ కాంట్రవర్సీపై డైరెక్ట్‌గానే ఓపెన్ అయ్యింది. తాను ఏం చెప్తుందంటే.. తాము డాక్యుమెంటరీ సమయంలోనే ఆ సినిమా విజువల్స్ కోసం ధనుష్ ని అప్రోచ్ కావడానికి ట్రై చేసాం అని నయన్ తెలిపారు. తన దగ్గర నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుందాం అనే అనుకున్నాము కానీ అతను అందుబాటులో లేడు అని చెప్పింది.

అలాగే తాము ఆ సినిమా నుంచి కేవలం నాలుగు లైన్స్ మాత్రమే తీసుకుందాం అనుకున్నాము కానీ అది కూడా కుదరలేదు. అయినా తమ డాక్యుమెంటరీలో చూపించిన విజువల్స్ కూడా అప్పుడు యూనిట్ సభ్యులు సెల్‌ఫోన్ కెమెరాతో చిత్రీకరించినవి మాత్రమేనని నయనతార తెలిపారు. ఇవి కేవలం షూట్ మధ్యలో విజువల్స్ అని.. వాటికి కూడా అభ్యంతరం చెప్పడం తనకు నచ్చలేదు అన్నట్టు వ్యాఖ్యానించింది

ధనుష్ తమకి మంచి ఫ్రెండ్ అయినప్పటికీ ఇలా జరిగిపోయింది అని నయనతార తెలిపారు. అయినా తాను భయపడటం లేదని.. నేను ఏదన్నా తప్పు చేస్తే భయపడాలి తప్ప.. నేను తప్పు చెయ్యలేదు కాబట్టి భయపడను అని ఈ వివాదంపై కీలక కామెంట్స్ చేసింది. దీనితో వీరి కాంట్రవర్సీలో ఫైనల్ గా ధనుష్ పై కామెంట్స్ చేయడం కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఇది పక్కన పెడితే ధనుష్ , నయనతారలు పలు చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు.

# వికటకవి వెబ్ సిరీస్ రివ్యూ అండ్ రేటింగ్

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోని అమరగిరి ప్రాంతంలోని దేవతల గుట్ట ఆటవీ ప్రాంతంలో మిస్టరీగా ప్రజలు జ్ఞాపకశక్తి కోల్పోయి గతం కోల్పోతుంటారు. ఈ మిస్టరీని ఛేదించడానికి ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి రామకృష్ణ (నరేష్ అగస్త్య) డిటెక్టివ్ అవతారం ఎత్తి అమరగిరి చేరుకొంటాడు.

అమరగిరి గ్రామస్థులు ఎందుకు గతాన్ని మరిచిపోతుంటారు? దేవతల గుట్టలో అగ్ని వర్షం కురువడానికి దేవత శాపమే కారణమా? ఇంతకు రామకృష్ణ ఎవరు? అమరగిరికి రామకృష్ణ ఎందుకు వెళ్లాడు? రామకృష్ణను ఆ గ్రామ పెద్ద రాజ నర్సింహ రావు (సిజ్జు), ఎమ్మెల్యే రఘుపతి (రఘు కుంచె) ఎందుకు అడ్డుకున్నారు? మహాదేవ్ (తారక్ పొన్నప్ప)కు రామకృష్ణ ఉన్న రిలేషన్ ఏమిటి? లక్ష్మీ (మేఘా ఆకాశ్)తో ప్రేమ బంధం ఎలా సాగింది? సౌత్ పాకిస్థాన్ ఏర్పాటు లక్ష్యంగా అజయ్ ఖాన్ చేసిన దుష్ట ప్రయత్నాలను రామకృష్ణ ఎలా తిప్పికొట్టాడు? అనే ప్రశ్నలకు సమాధానమే వికటకవి వెబ్ సిరీస్ కథ.

వికటకవి కథ విషయానికి వస్తే.. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం బ్యాక్ డ్రాప్‌తో స్టోరీ 70వ దశకంలో ప్రారంభమవుతుంది. అటవీ ప్రాంతంలో ఓ ప్రదేశానికి వెళ్లిన వారంతా గతాన్ని మరిచిపోవడమనే పాయింట్‌తో ప్రేక్షకుడిని కథలోకి దర్శకుడు ప్రదీప్ మద్దాలి తీసుకెళ్లిన తీరు బాగుంది. చిన్న చిన్న ట్విస్టులతో ప్రతీ ఎపిసోడ్‌లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిన విధానం బాగుంది. ఫ్లాష్ బ్యాక్‌ను డీల్ చేసిన విధానం, పాత్రలను కథలోకి జొప్పించిన విధానం ఆయన ప్రతిభకు అద్దం పట్టింది. ఎమోషన్స్‌తోపాటు యాక్షన్ పార్టుగా తీర్చిదిద్దిన తీరు మెప్పించేలా ఉంది.

నటీనటుల విషయానికి వస్తే.. రామకృష్ణగా నరేష్ అగస్త్య బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడనే కంటే.. వెబ్ సిరీస్‌ను మొత్తం తన భుజాల మీద మోశాడనే చెప్పాలి. రామకృష్ణగా మాత్రమే కనిపిస్తూ.. మెచ్యూరిటీతో కూడిన నటనను ప్రదర్శించాడు. తన కెరీర్‌లో ఈ వెబ్ సిరీస్ ద్వారా బెస్ట్ ఇచ్చాడనే ఫిలింగ్ కల్పించాడు. రాజాగా సిజ్జు హుందాతనంతో కనిపించాడు. ఎమ్మెల్యే రఘుపతిగా మరోసారి రఘు కుంచె చెలరేగిపోయాడు. పవర్‌ఫుల్ విలనిజంతో నటుడుగా తన రేంజ్ ఏంటో చెప్పకనే చెప్పాడు. మహదేవగా తారక్ పొన్నప్ప, లక్ష్మీగా మేఘా ఆకాశ్, మిగితా పాత్రల్లో కనిపించిన వారాంత ఉత్తమ నటనను ప్రదర్శించారు.

మిస్టరీ, సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌కు ఏం రేంజ్ మ్యూజిక్ కావాలో ఆ స్థాయిలో అజయ్ అరసదా సంగీతాన్ని అందించాడు. సోషబ్ సిద్దిఖీ సినిమాటోగ్రఫి సిరీస్‌ను రిచ్‌గా మార్చింది. స్టోరీ ఎలిమెంట్స్‌కు తగినట్టుగా కలర్ టోన్ ఉపయోగించిన తీరుతొ సన్నివేశాలు మరింత రిచ్‌గా కనిపించాయి. ఎడిటింగ్ విభాగం పనితీరు బాగుంది. సీజీ వర్క్‌పై మరింత దృష్టిపెట్టాల్సి ఉండాల్సిందనిపిస్తుంది. రజనీ తాళ్లూరి నిర్మాతగా అనుసరించిన ప్రొడక్షన్ వ్యాల్యూస్ హై స్టాండర్డ్స్‌లో ఉన్నాయి.

దేశభక్తి, రూరల్ డ్రామా, మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ తదితర అంశాలను కలబోసి రూపొందించిన థ్రిల్లర్ మూవీ వికటకవి. ఈ మధ్యకాలంలో వచ్చిన వెబ్ సిరీస్‌లో ది బెస్ట్ అనే ఫీలింగ్ కల్పిస్తుంది. యాక్టర్ల పెర్ఫార్మెన్స్, టెక్నిషియన్స్ పనితీరు ఈ సినిమాను అత్యంత బలంగా మార్చాయి. తెలంగాణ డైలాగ్స్ పర్‌ఫెక్ట్ సింక్‌లో పేలాయి. కథాపరంగా, మేఘా ఆకాశ్ క్యారెక్టర్ పరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండేదనిపిస్తుంది. ఓవరాల్‌గా నిరాశపరచకుండా.. మంచి అనుభూతిని కలిగిస్తుంది. జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. మీకు తీరిక ఉన్న సమయంలో చూస్తూ చక్కగా ఎంజాయ్ చేయవచ్చు. డోంట్ మిస్ ఇట్.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com